
## ఈ వారం కథ

# బ్రిడ్జికి అవతల

'నిశాపతి'

అతను ఈ భూమ్మీద ఎప్పుడు పడ్డాడో తెలీదు గాని దానికి కొన్ని క్షణాల తర్వాత మాత్రం పట్టాల మీద పడ్డాడు. రైలు పట్టాలకి అవతలివైపున్న ఓవర్‌బ్రిడ్జి కింద వున్న గుడిశలోంచి ఎగిరి యివతలవైపు పడ్డాడు. ఆ విసిరిన చేతులైనా మరీ బొత్తిగా పరాయివి కావు.



(వాటికీ అతనికీ తొమ్మిది నెలల అనుభంధం వుంది)

పొట్ట ఎత్తుగా వుండడం చేత రెండు నెలలబట్టీ కడుపు ఖాళీగా వున్న కసినంతా అతనిపై చూపించింది. పైగా ఈ మగవెధవ ఎందుకు పనికొస్తాడు? అదే ఆడపిల్లయితే యిట్టే చేతికి అందివచ్చును.

అయితే, పాపం భారతీయ రైల్వేలకి పక్షపాతం లేదు. అవి అందర్నీ సమానంగా నిరుత్సాహ పరుస్తాయి. సకాలంలో గమ్యం చేరుద్దామని బైలుదేరిన ప్రయాణీకుల్ని ఎంత నిరుత్సాహ పరిచాయో, కాసులమ్మనీ అంతే నిరుత్సాహ పరిచాయి. అయితే కాసులమ్మ టిక్కెట్టు కొనలేదు గాబట్టే దానిమీద 'విష్‌యువ హ్యాపీ జర్నీ' అని రైల్వే వారు వాగ్దానం చెయ్యలేదు కాబట్టే సరిపోయింది.

అయితే ఆ సమయంలో ఆ పట్టాల మీదికి ఏ ఎక్స్‌ప్రెసో, కనీసం ప్యాసింజరో, ఆఖరికి గూడ్సో వచ్చి వుంటే పందిరయ్య అనే ఒక భారతీయుడు గానీ, వాడికో కథ గానీ మనకి వుండేవి కాదు. ఆ మేరకి భారతదేశ చరిత్రకి రైల్వే వారు చేసిన సేవ పరిగణించదగిందే. పట్టాలమీద చేతులూ, కాళ్ళూ అటూయిటూ ఆడిస్తూన్న వింత జీవిని చూసి కుతూహలం చంపుకోలేని రెండు పందులు ఆ పదార్థాన్ని ఈడ్చుకుని వచ్చి మళ్ళీ కాసులమ్మ దగ్గరే పడేశాయి. దాంతో కాసులమ్మ "బంగారం లాంటి ఆడబొట్టె పురుట్లోనే సచ్చింది, కాని ఈ సచ్చినోడు సంపినా సావడేటి"? అనుకుంటూ ఆ పసికందుని చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకుంది. ఆ తరువాత ఏడుపువస్తూనే వుందామెకి.

శకుంత పక్షులచే పెంచబడినబాలిక శకుంతల అయినట్టు అలా పందిరయ్య పుదుతూనే పేరుతో పుట్టాడు గాని ఆ దరిమిలా అతని కెవరూ బారసాల చేసి పేరు పెట్టలేదు. అయితే సీనియర్లు గూడ్సు పెట్టెలపైకి ఎక్కి అందులోనించి బొగ్గులు కిందకి విసుర్తూంటే వాటిని జాగ్రత్త చెయ్యడంతో పందిరయ్యకి అక్షరాభ్యాసం మాత్రం సరిగా ఐదోఏటే జరిగింది. రైలు వచ్చే వేళ్ళల్లో ప్లాట్‌ఫాం మీదికి వెళ్ళి అడుక్కోడం, అలా ఒక్కో క్లాసూ పైకి రావడం మొదలెట్టాడు. చీకటి పడగానే రైల్వే కలాసీల లాంటి వాళ్ళు తమ ఇంటికి ఎందుకు వస్తారో వాడికి తెలీకపోయినా వాళ్ళొస్తే మాత్రం డబ్బులొస్తాయని అర్థమైంది. వాళ్ళు బీడీలకనీ, చుట్టలకనీ యిచ్చే పావలా పరకాలో పైసా అరపైసా కొట్టెయ్యడం చాలా సహజంగా– ప్రహ్లాదుడికి విద్యలన్నీ తమంత తామే వచ్చినట్టు పట్టుబడింది.

పందిరయ్యకి ఎన్నో ఏడో అతనికిగానీ వాళ్ళమ్మకి గానీ తెలీదు. పందిరయ్య అన్నానికి యింటికి రాకుండా ఏ స్టేషను క్యాంటిన్‌లోనో పెళ్ళియిళ్ళకి వెళ్లే గుంపుల్లోనో రోజు గడుపుకుని వచ్చినప్పుడల్లా కాసులమ్మ సంతృప్తిగా నిట్టూర్చేది. అతను పూర్తిగా ఏ సినిమా హాల్లోనో బ్లాక్‌లో టిక్కెట్లమ్మి తన పొట్ట తను పోసుకునే రోజుకోసం ఎంతో ఆత్రంగా ఎదురుచూసేది. అసలు పందిరయ్యకి ఎన్నోఏడు అన్న ప్రశ్న తలెత్తవలసిన మాటే కాదు. ఆ రోజు జీపు లోంచి ఆ తెల్ల బట్ట లాయన దిగి వుండకపోతే దిగినా ఆ ప్రశ్న అడగి వుండకపోతే అడిగినా ఓటు హక్కు యిరవై ఒకటి నించి పద్దెనిమిదికి వయోపరిమితినితగ్గించి వుండకపోతే –

అసలేం జరిగిందంటే– ఆ తెల్లటోపీఆయన దిగుతూనే రెండు చేతులూ జోడించి మరి విప్పకుండా



16–10–92 ఆంధ్రజ్యోతి వారపత్రిక

అలాగే నడవడం సాగించాడు. కాసులమ్మ గుడిశ దగ్గరికి రాగానే టక్కున ఆగిపోయి యింకా మీస కట్టు గూడా సరిగారాని పందిరయ్యని చూస్తూ "వీడికి పద్దెనిమిదేళ్ళు వుండవ్"? అంటూ ఓ జనరల్ నాలెడ్జ్ క్వశ్చన్ జనం మీదికి వదిలాడు. అలా ప్రజల కొరకు ఎన్నుకొనబడే ప్రజల ప్రభుత్వాన్ని ఎన్నుకో డంలో ఆ రోజునించీ పందిరయ్యగూడా భాగస్వామి అయ్యాడు. అయితే తను ఎన్నుకున్న వాళ్ళు అక్కడి కెళ్ళి ఏం చేస్తారో, ఏం చెయ్యగలరో అతనికి తెలీదు. అసలు ఓవర్‌బ్రిడ్జి కింద బతికేవాళ్ళు గాక మిగతా సగం ప్రపంచం ఎలా బతుకుతాదో అతనికి తెలీదు. అతనికి తెలిసిందల్లా వాళ్ళ దగ్గర తమ దగ్గర కంటే చాలా ఎక్కువ డబ్బుంటుందనీ తెల్లటోపీ ఆయన కొత్తగా సంపాదించిపెట్టిన ఈ పెద్దరికం వల్ల తనకీ డబ్బులొస్తాయనీ! అంతే!

తర్వాత కొద్దిపట్లో మరో పచ్చ టోపీ ఆయనవచ్చి పెద్ద గుడిశ సింహాల్తో ఏదో మాట్లాడాడు. సింహాలు ఆయనతో "మేం తెల్ల టోపీ ఆయనకి మాటిచ్చాం" అని చెప్పి పంపేశాడు. పందిరయ్య వాళ్ళమ్మ దగ్గ రికి వెళ్ళి "అమ్మా ! ఈడికాడ గూడా డబ్బుల్నాకి ఆడికే ఓటేస్తే ఈ డెట్టా కనుక్కుంటాడే?" అని ఓ సందేహం వెలిబుచ్చాడు. ఆ మాటలకి కాసులమ్మ పందిరయ్యని కోప్పడింది. "నీతీ నాయం వుండాల్రా పందీ! ఒహరికాడ డబ్బుల్దీసుకుని ఒహ రికాడ తొంగోడం ఎంత పాపమో యిదీ అంతే!" అంది.

మొత్తానికి తెల్ల టోపీ ఆయన పంపిన జీపులో ఆయన మనుషుల్తోపాటువెళ్ళి అతనూ మరో పాతిక మంది పోలింగ్ బూత్‌లోఓటేసి నడుచుకుంటూ వచ్చి యిల్లు చేరుకున్నారు. ఇంటికి రాగానే పెద్దగుడిశ సింహాలు చేతిలో బెట్టిన యిరవై రూపాయలూ పుచ్చు కున్నాడు. నిజానికి తెల్ల టోపీ ఆయన సింహాలుకి మనిషికి యాభై రూపాయల చొప్పున లెక్కగట్టి యిచ్చి నట్టు పందిరయ్యకి తరవాతెప్పుడోగాని తెలీలేదు. ఇరవై రూపాయలు! పందిరయ్య చాలా ఆశ్చర్యపోయాడు. అతను యిరవై రూపాయల నోటుని రెండు మూడు సార్లు దూరం నించి చూశాడు. తమ గుడిశల పక్కన రిక్షాలు ఆవుకునే రిక్షా వాళ్ళ దగ్గర. అది చాలా పెద్ద మొత్తమేననీ, దానితో చాలా వస్తువులు కొనుక్కోవచ్చనీ పందిరయ్య ఆ నోటువంక భక్తిగా ఈర్ష్యగా చూసే వాడు. అలాంటిది యివాళ తన చేతిలోయిరవై రూపాయలు!పందిరయ్య ఆ రోజు ఆ మొత్తంతో చాలా థ్రిల్ అనుభవించాడు.

ఆ రోజునించీ పందిరయ్యకి ప్రజాస్వామ్యంపట్ల చాలా గౌరవం పెరిగింది. ఈ ఎన్నికలనేవేవో అయి దేళ్ళకోసారికాక రెణ్ణెల్లకో మూణ్ణెల్లకో వస్తే ఎంత బావుణ్ణు! అనుకున్నాడు. దేవుడు అతని మొర ఆల కించాడో! ఏమోఆర్నెల్లలోపలే ఉప ఎన్నికలొచ్చాయి. తెల్లటోపీ ఆయనమళ్ళీ వచ్చాడు. అయితే ఈసారి ఆయన ఎర్రటోపీ పెట్టుకుని వున్నాడు. సింహాలు అందరితోపాటు పందిరయ్యనీ పక్కకి పిలిచి ఎర్ర టోపీ ఆయన చెప్పిన విషయం మంతా వివరించాడు.

"పోయినసారి మనోళ్ళంతా మోసం చేశారంట. అందుకే తను ఓడిపోయానని ఆయన అనుకుంటుం డాడు. అదృష్టవశాత్తూ ఆ గెలిసినాయన సావడానికి మళ్లీ ఎలచ్చన్లు రావడానికి ఈన శానా కష్టపడ్డా డంట. ఈ సారి ఓడిపోతే ఈనకు శానా నష్టమంట. గెలిసినోళ్ళు మాటిమాటికీ సావాలంటే కుదురుద్దా అంటున్నాడు. అందుకని ఈ సాలి ఏర్పాటు మారి సేసినాడంట. మనం బూతులో కెల్లాల. ఎల్లినట్టే ఎల్లి బూతులో ఓటు ఏసినట్టే ఏసి మడిసి జేబులో పెట్టుకుని తెచ్చి తనకివ్వాల. ఓటుయిచ్చేయంగానే డబ్బులిత్తాడంట. తరువాత తన మనుసులు వెల్లి ఆ ఓట్లన్నీ ఏసేత్తారంట.

ఆ విధంగా ఆర్నెల్ల కాలంలో రెండు సార్లు పంది రయ్య భారత భాగ్యవిధాత ఐనాడు. ఈ సారి యాభై రూపాయలు కళ్ళ జూశాడు. పందిరయ్యకిప్పుడు యిరవై ఏళ్ళు. అతనిప్పుడు చాలా ఎదిగాడు. ఇది వరకులాగా పైసా అరపైసాతో తృప్తిపడడం లేదు. వచ్చిన వాళ్ల దగ్గర్నించి తన కమీషన్ తను ఖచ్చితంగా వసూలు చేస్తున్నాడు. అదేవిటంటే రేపు అది ముసిల్దయితే దానికి నేను తిండెట్టొద్దా? అని వాదించే గడుసుతనం నేర్చుకున్నాడు. చిన్న చిన్న దొంగతనాలూ, సినిమా హాలుదగ్గర బ్లాక్‌లో టిక్కెట్లమ్మడం మొదలైన విద్యల్లో అనుభవం సంపా దించి తన కాళ్ళమీద తను నిలబడుతున్నాడు. మళ్ళీ ఎలక్షన్లు వచ్చాయి. ఈసారి సింహాలు అసి స్టెంటుగా పందిరయ్య గూడా ముగ్గులోకిదిగాడు. యాభై రూపాయలు ఏమూలకి? అన్నాడు!" ఎలక్షన్లు వచ్చినప్పుడేగదా మీరు మాకాడకొచ్చేది ? ఇప్పుడు మాకు సాయం చెయ్యకపోతే ఎప్పుడు సేత్తారు?" అన్నాడు. వాళ్ళు ఇంతిస్తామన్నారని వీళ్ళకీ, వాళ్ళు అంతిస్తామన్నారని వాళ్ళకీచెప్పి రేటు నూట యాభై దాకా పెంచాడు. బోనస్ మనిషికి రెండు సారా ప్యాకెట్లన్నాడు. మొత్తానికి ఒప్పందాలన్నీ సజావుగా జరిగాయి. ఎలక్షను రోజొచ్చింది. తెల్లవారినప్పటి నించి ఎదురు చూస్తూ కూర్చున్నారు అందరూ. ఎవరూ వీళ్ళ దగ్గరికి రాలేదు. ఏదో అనుమానం వచ్చి సింహాలు పోలింగ్ బూత్ దగ్గరికి వెళ్ళాడు. వస్తూనే కుప్పగూలిపోయాడు. సింహాలు "అన్యాయం జరిగి పోనాదిరా పందీ! ఇహ మనకి వాళ్లు డబ్బియ్యరంట. మన ఓట్లుగూడా వాళ్లే గుద్దు కుంటారంట. అదేందో రిగ్గింగట" అన్నాడు మాట పెగుల్చుకుంటూ. పందిరయ్యకి అసహ్యం వేసింది. ఈ విషయం వాళ్ళమ్మకి చెబితే ఏం పోలిక చెబు తుందో వెంటనే ఊహించలేకపోయాడుగాని కొంచెం ఆగాక 'ఛూ' అనుకున్నాడు. ◆

## ఆటవెలదులతో వావిలాల!

"కామిగాని వాడు మోక్షగామి కాడు" అని స్వానుభవ పూర్వ కముగా చాటి చెప్పిన వేమన యోగి . .. తన పూర్వ జీవితములో భోగియై యున్నప్పుడు ఆటవెలదుల సంసర్గాన్ని (వేశ్యా లోలతను) ఎంతగా కాంక్షించాడో ... తర్వాత యోగియై కూడా ఆటవెలదులపైన (ఆటవెలది పద్యాలపైన) అంతగా అనురాగాన్ని ప్రదర్శించారు. అంతటి మహాయోగి చేత ప్రేమించబడడం ఆ ఆటవెలదుల అదృష్టం.

వావిలాల వాసుదేవ శాస్త్రిగారని ... కందుకూరి వీరేశలింగం పంతులుగారి సమకాలికులు ... మహాకవి ... సుప్రసిద్ధ రచయిత ... ఎన్నో షేక్స్పియర్ నాటకాలను ఆంధ్రంలోనికి అనువదించిన పాండిత్య ప్రకాండుట ... రాజమండ్రిలో వుండేవారు. వీరు, వీరే శలింగంగారు, వడ్డాది సుబ్బారాయుడుగారు – వీరు ముగ్గురినీ నవ కవిత్రయం అనేవారాకాలంలో. ఆయన పేరు "వావిలాల వాసుదేవశాస్త్రి" అన్నది సరిగ్గా ఒక ఆటవెలది పద్య పాదానికి ఇమిడిపోతుంది. అందుకే ... ఆయనకు బావమరిది వరసైన కొండుభట్ల సుబ్రహ్మణ్యశర్మగారు "మా బావగారు ఆటవెలది పాదానికి కట్టుబడిపోయారు" అంటూ శాస్త్రిగారిని ఆటపట్టించే వారు.



అలా ... గొప్ప గొప్ప వాళ్ళను తన వాళ్ళనుగా చేసుకోగలగడం 'ఆటవెలదు'ల ఘనతను చెప్పకనే చెప్తూంది.

– శ్రీమతి గొల్లాపిన్ని (పాణ్యం) వసుంధరాదేవి